
**చిన్న చిన్న కారణాలకే తమకి అడ్డం వచ్చారనో, నచ్చలేదనో గోడలు కట్టి గ్రూపులు పెట్టి ఎదుటివాళ్లను దూరంగా ఉంచే మనుషులు, ఆ విషయంలో ఎంత దూరం వరకు వెళ్లగలరో చూపించాలన్న ప్రయత్నమే...**

పాణిని జన్నాభట్ల

# 10

# ఆఖరి గోడ

చారి పి.ఎస్.





"ఇంకోసారి ఆలోచించు," అన్నాడు మహీ సీరియస్‌గా.

వీడికేమైంది మధ్య, ప్రతిదానికీ అడ్డుపడుతున్నాడు. అనవసరంగా ఎక్కువ లీనియెన్స్ ఇచ్చానా?

"ఆలోచించడానికేం లేదు. కట్టేసెయ్, మామూలుగా నువ్వెప్పుడూ కట్టేదే. కొంచెం హైట్ పెట్టు కాకపోతే, ఈసారి ఎనిమిది అడుగులు చెయ్," అన్నాను మహీకి మళ్లీ ఛాన్స్ ఇవ్వకుండా.

దెబ్బతిన్నట్టు చూశాడు నావైపు. నేను చేతులు కట్టుకుని నించున్నాను. 'అదే నా ఆఖరి మాట,' అనే సంకేతాన్ని పంపుతూ.

దృఢత్వానికీ, మూర్ఖత్వానికీ మధ్య ఉండే సన్నటి గీత పైన మునివేళ్ల మీద నించున్నాన్నేను.

వాడో ఆఖరి ప్రయత్నం చేశాడు.

"పోనీ తలుపైనా పెడతాను, తర్వాత నీకు మారాలనిపిస్తే ఉంటుంది?"

తల అడ్డంగా ఊపాను.

గీతమీదనుండి వెనక్కి పడిపోతున్నాను. అంతా వీడివల్లే.

వాడు వెనక్కి తిరిగి అయిష్టంగా పని మొదలుపెట్టాడు. చకచకా చేసేస్తాడు ఒక్కసారి స్టార్ట్ చేశాడంటే. మధ్యలో హఠాత్తుగా ఆపి, "ఈ ఎత్తులో కిటికీ ఒకటి పెడితే బాగుంటుంది కనీసం, నువ్వు అవతలివైపు చూడచ్చు ఎప్పుడైనా," అని గొణిగాడు. నేను తల దించి గోళ్లు గిల్లుకుంటున్నాను. గీతమీదనుండి పూర్తిగా వెనక్కి పడిపోయా నిప్పుడు.

నిట్టూర్చి, మిగతా పనీ పూర్తిచేసాడు వాడు.

"అయిపోయింది చూస్కో," అన్నాడు నా పక్కకొచ్చి నిలబడుతూ.

తలెత్తాను. నా పెదాల మీద అప్రయత్నంగా మెరిసిన చిరునవ్వు.

మా ఎదురుగా వంద అడుగుల వెడల్పూ, ఎనిమిదడుగుల ఎత్తుతో ఎర్రగా మెరుస్తున్న నున్నటి గోడ!

నా గురించీ, మా ప్రపంచం గురించీ కొంత చెప్పాలి.

మాకు చిన్నప్పటి నుండీ ఇంటా బయటా నేర్పేదీ, మేము అతి శ్రద్ధపెట్టి నేర్చుకునే మొట్టమొదటి విద్య- గోడలు కట్టడం!

మీకిది కొంచెం విచిత్రంగా అనిపించచ్చు, కానీ మాకిది చాలా మామూలు విషయం. ఎవరు ఎంత వేగంగా, అందంగా గోడలు కట్టగలిగితే వాళ్లే గొప్ప. అసలు గోడలు కట్టడం మా రాజ్యాంగం మాకిచ్చిన ప్రాథమిక హక్కు. ఓట్ల కోసం దాన్ని అమలుపరచడానికి ఏ ప్రభుత్వమూ వెనకాడలేదు. గోడలు కట్టలేని అమాయకులకి ఎలా కట్టాలో మా ప్రభుత్వాలే స్వయంగా నేర్పిస్తాయి కూడా!

అసలు గోడలెందుకు కట్టడం మనుషుల మధ్యలో? మంచి ప్రశ్న. కారణం ఏదైనా కావచ్చు, ఎంత చిన్నదైనాసరే. ఎదుటివాడి మొహం నచ్చలేదనో, వాడి షూస్ బాలేవనో, వాడుండే ఇల్లు సౌత్ ఫేసింగ్ అనో అంతే, బ్రహ్మాండమైన కారణా లక్కర్లేదు. ఎవడికి ఇష్టమొచ్చిన గోడలు, ఎప్పుడు పడితే అప్పుడు కట్టుకోవచ్చు.

ఆ విషయంలో నేను చిన్నప్పటినుండీ అందరికన్నాముందుండే వాడిని. నాకా టాలెంట్ నాచురల్‌గా వచ్చిందనేవాళ్లు అందరూ. అలా గోడలు కట్టడంలో దూసుకు పోతున్న నాకు, పదిహేనో ఏట పెద్ద చిక్కొచ్చి పడింది. టైం! ఇటు చదువూ, అటు ఇంటిపనుల్లో పూర్తిగా బిజీ అయిపోయి తీరిగ్గా గోడలు కట్టుకోవడానికి టైం లేకుండా పోయింది. నా ప్రాథమిక హక్కుని వదులుకోలేక చాలా బాధపడ్డానప్పుడు. అప్పుడే నాలాంటి వాళ్లకి ప్రభుత్వం చేయూతనిస్తోందని తెలిసి ఎగిరి గంతేసాను. ఆ పథకం ప్రకారం, నేను గనక వాళ్లు పెట్టిన ఇంటర్వ్యూలో పాసైతే నాకు ప్రత్యేకంగా గోడలు కట్టేందుకు ఒక పనివాడిని ఇస్తారు, జీవితాంతం!

ఇంటర్వ్యూ చేసే ఆఫీసర్ నా వయసు చూసి నవ్వాడు.

“అసలు నీ అప్లికేషన్ మేమెందుకు యాక్సెప్ట్ చెయ్యాలో, ఇంతకుముందు ఎలాంటి గోడలు కట్టావో కనీసం రెండు గట్టి ఉదాహరణలు చెప్పు,” అన్నాడు ధీమాగా.

నేనెక్కడా తడుముకోలేదు. చిన్నప్పుడు నా క్లోజ్ ఫ్రెండ్ వాళ్ల నాన్న కూరగాయ లమ్ముతాడని తెలిసినప్పుడు మా ఇద్దరి మధ్యా నేను కట్టిన మందం గోడ గురించి చెప్పాను. మా రిలేటివ్ ఒకతను మొదటిసారిగా తన పెంకుటింటికి తీసికెళ్లినప్పుడు నేను కట్టిన ఎత్తుగోడ గురించి చెప్పాను. మార్కుల్లో జిల్లా ఫస్టొచ్చానని నా ఫ్రెండ్ గర్వంగా చెప్పినప్పుడు కట్టిన వెడల్పాటి గోడ గురించి చెప్పాను. ఆ ఆఫీసర్ నివ్వెర

పోయాడు, నీరుగారిపోయాడు. ఆపమన్నట్టు బలవంతంగా చెయ్యి చూపించాడు. నేను భుజాలెగరేసాను, 'ఇవి కొన్నే,' అన్నట్టు.

''నీకున్న అర్హతల వల్ల, గోడలు కట్టడానికి నీకు శాశ్వతంగా ఒక సహాయకుడిని ఆమోదిస్తున్నాను,'' అని చివరికి నా అప్లికేషన్ మీద సంతకం చేసి, కసిగా స్టాంప్ గుద్దాడు.

గర్వంతో బయటికి నడిచాన్నేను.

''ఇంత చిన్నపిల్లలకే అసిస్టెంట్లని ఇవ్వాల్సొస్తోంది,'' నసిగాడు ఆ ఆఫీసర్ వెనకాల.

అదిగో అలా వచ్చాడు మహీ నా జీవితంలోకి. నా దగ్గరికొచ్చినప్పుడు తనదీ నా వయసే. నేను చెప్పినప్పుడల్లా, చెప్పిన సైజుల్లో గోడలు కట్టడమే తన పని! మహీని నేనెప్పుడూ ఓ పనివాడిలా చూడలేదు. ఓ ఫ్రెండ్‌కన్నా ఎక్కువ తను.

వాడు వచ్చినప్పటినుండీ నా వేగం బాగా పెరిగింది. తనూ నాలాగే, ఏది చెప్పినా చకచకా అల్లుకుపోయేవాడు. నాకు కొత్త కొత్త ఆలోచనలిచ్చేవాడు. ఏ టైంలో, ఎలాంటి గోడ, ఏ మెటీరియల్‌తో కట్టాలో చెప్పేవాడు. గోడల్లో ఎన్నో రకాలు తెచ్చాడు. తలుపులున్నవి, కిటికీలు మాత్రమే ఉన్నవి, టెంపరరీవి- ఇలా రకరకాలవి తయారుచేసాడు. వాటిల్లో నాకన్నిటికన్నా ఇష్టమైంది - తలుపుకి ఒక వైపే తాళమున్న గోడ. నాకిష్టమొచ్చినప్పుడు తెరవచ్చు, మూయచ్చు!

మా ఫ్రెండ్స్‌కీ ఇలా వాల్ బిల్డర్స్ ఉన్నారు కానీ, అందరికీ మహీ అంత సింక్‌లో ఉండేవాళ్లు దొరకలేదు. 'నువ్వు లక్కీరా,' అనేవాళ్లు జెలెస్ ఫెలోస్.

మహీ, నేనూ తర్వాత పదేళ్లల్లో చాలా గోడలు కట్టాం. నేను బాధపడినప్పుడు కొన్ని కట్టాం, కోపం వచ్చినప్పుడూ కట్టాం. వాడెలా తయారయ్యాడంటే నా మొహం మీదుండే ఎక్స్‌ప్రెషన్‌ని బట్టీ గోడలు కట్టేసేవాడు. ఎవరినన్నా చూసి నేను ఓ రకంగా నవ్వితేనో, అసహ్యంగా మొహం పెడితేనో గోడ మొదలుపెట్టేసేవాడు. ఓసారి బాగా గుర్తుంది. అందంగా ఉన్న ఒకమ్మాయి నా దగ్గరకొచ్చిందొక బస్టాండ్‌లో. ఏదో కనుక్కోవడానికి నోరు తెరిచింది. అంతే తన పల్లెటూరి భాష చూసి నాకు నవ్వు తన్నుకొచ్చింది. తల దించుకుని, నవ్వాపుకోని మెల్లగా తలెత్తి చూస్తే, ఎదురుగా పెద్ద మొండి గోడ! క్షణాల్లో కట్టాడు. అవతలి అమ్మాయికి ఏమీ అర్థంకాక పిచ్చిగా గోడని కొడుతూ నన్ను తిట్టుకుని వెళ్లిపోయింది. నేనూ, మహీగాడు చాలాసార్లు నవ్వుకున్నాం అది తలుచుకొని.

వాడు నా నీడ.

కొంతకాలానికి పై పై విషయాలని దాటి సీరియస్ విషయాలకే గోడలు కట్టాలని నిర్ణయించుకున్నాం ఇద్దరం.

ఓసారి నా ఆఫీస్ కొలీగ్ నేను బాగా ఫాలో అయ్యే మా గురూజీని అవహేళన చేస్తూ అందరిముందూ తిట్టినప్పుడు కట్టించానొక గోడని. అదే గురూజీ నా కులం చేసిన అరాచకాల్ని ఓ రోజు ఎత్తిచూపినప్పుడు బాధతో కట్టించానింకొక ముళ్ల గోడని.

ఎదుటివాడు నన్ను సూటిగా ప్రశ్నలు వేసినప్పుడూ, నేను సమాధానాలు చెప్పలేక గింజుకున్నప్పుడూ కట్టించాను ఇంకొన్ని గోడల్ని.

'వాళ్లని వదిలేసా నేను', 'నా లెక్కలోంచి తీసేసా', 'అస్సలు ఉపయోగం లేదు వాళ్లతో', 'ఏం చూస్కోని పొగరో'... ఇలాంటివి అన్నప్పుడల్లా లేచిపోతుండేది ఏదో ఒక రకమైన గోడ.

కాలంతోపాటు మహీ కూడా అప్‌గ్రేడ్ అయ్యాడు. సోషల్ మీడియాలో నన్ను ఇబ్బందిపెట్టిన వాళ్లందరికీ 'వర్చువల్ వాల్స్' కట్టడం మొదలుపెట్టాడు.

అంతా బానే ఉంది అనుకుంటున్న టైంలో నేనొక పొలిటికల్ పార్టీలో జాయినయ్యాను. అందులో యాక్టివ్‌గా తిరగడం మొదలుపెట్టాను. ఆ పార్టీలో పెద్ద పెద్ద గోడలు కట్టే అవసరముందని తెలిసి మహీని కూడా ఆ పనిలో పెట్టాను. కొంతకాలం మిగతా బిల్డర్స్‌తో కలిసి బానే పనిచేసాడు కానీ, రాన్రానూ వాడిలో అసహనం ఎక్కువైంది.

"ఇదంతా కరెక్ట్ కాదనిపిస్తోంది," అన్నాడు నాతో ఒకసారి.

"ఇంతకుముందూ నేనే చెప్పాను, ఇప్పుడూ నేనే చెప్తున్నాను కట్టమని. తేడా ఏముంది?" అన్నాను ఆశ్చర్యబోతూ.

"ఇది నువ్వు చేస్తోంది కాదు. నీతో చేయిస్తున్నారు," అన్నాడు.

"ఏదైతేనే, ఇది నా నిర్ణయం. నువ్వు నే చెప్పింది చెయ్యాలి, అంతే," అన్నాను తన పని గుర్తుచేస్తూ.

"దీంట్లో నీ ఆలోచనెక్కడుంది? వాళ్లెవరిమీదో పడి అరుస్తారు, మీచేత అరిపిస్తారు. నీలాంటివాళ్లు ఆలోచించకుండా మా చేత పని చేయిస్తారు. చివరికి ఎందుకు చేయిస్తున్నావో నీకూ, ఎందుకిన్ని గోడలు కడుతున్నానో నాకూ తెలియని పరిస్థితి," ఆవేదనంతా వెళ్లగక్కాడు.

ఇంతకుముందు చిన్నచిన్న విషయాలకే నాకు సహకరించిన మహీనేనా ఇలా మాట్లాడుతోంది అనిపించింది. కొంపదీసి నాకన్నా వీడి మెచ్యూరిటీ పెరిగిందా? ఎందుకో దీన్ని పెద్దది చేసి వాడితో గొడవపడటం నాకిష్టంలేదు. ఈ ఒక్క విషయంతో

జీవితాంతం గోడలు కట్టే అవకాశం కోల్పోదల్చుకోలేదు నేను. పార్టీ నుండి బైటి కొచ్చేసాను.

అప్పటికి కొంచెం తగ్గినా, ఆ సంఘటన తర్వాత వాడి వరస కొద్దికొద్దిగా మారుతోంది. నాతో ముభావంగా ఉంటున్నాడు, చెప్పిన పని వెంటనే చెయ్యట్లేదు. ఇదివరకటిలా కొత్త కొత్త ఆలోచనలు కాదుకదా, నేనో గోడ కట్టమంటే తిరిగి వంద ప్రశ్నలు వేసి విసిగిస్తున్నాడు.

నేను కొత్త కొత్త కారణాలు చెప్పి వాణ్ణి ఒప్పించడం స్టార్ట్ చేశాను. అమాయకులని మతమార్పిడి చేసే వాళ్ళకి నైతికత లేదన్నాను. ఓ మతంవాళ్ళు చరిత్రలో మన ధర్మాన్ని కాలరాశారన్నాను. మన సౌత్ వాళ్ళంటే ఎప్పుడూ లోకువే నార్త్ జనాలకి అని సణిగాను. వాడు విన్నాడు, తలూపాడు కొంతకాలం. మంచి మంచి గోడలు ఇంకొన్ని లేచాయ్ నేననుకున్నట్టు. కానీ ఓరోజు తిరగబడ్డాడు. నావన్నీ వట్టి భయాలే, ఆధారాల్లేని అపోహలే అని తిట్టాడు. మళ్లీ మొదటికొచ్చింది వ్యవహారం!

మహీ మీద విసుగొచ్చి వాణ్ణి మార్చి ఇంకో అసిస్టెంట్ నివ్వమని గవర్నమెంట్ ఆఫీసులో అప్లికేషన్ పెట్టాను.

“గోడలు కట్టే పనివాళ్ళకి బాగా డిమాండ్ ఉందిప్పుడు మార్కెట్‌లో. వాళ్ల కోసం చాలామంది వెయిట్ లిస్ట్‌లో ఉన్నారు. మీకు కొత్తవాళ్లని ఇవ్వడం కుదరదు. ఉన్న దాంతో సరిపెట్టుకోండి,” అని వాళ్ల రిప్లై.

నేను వదలకుండా నా టాలెంట్ గురించీ, హక్కుల గురించీ మాట్లాడితే, “మీ కన్నా హైలీ టాలెంటెడ్ క్యాండిడేట్స్- అంటే పదేళ్ల వయసులోనే పెద్ద పెద్ద గోడలు కడుతున్న వాళ్లకే దిక్కులేదు. మీ టైంలాగా కాదిప్పుడు. ఉన్నది కూడా వదిలేసుకుంటే మీ ఇష్టం మరి,” అని భయపెట్టారు.

మహీని వదల్లేనూ, వాడితో పనీ చేయించుకోలేను. నా ‘ఎందుకు కట్టాలి’ వాడి ‘ఎందుకు కట్టగూడదు’ ఆర్గ్యుమెంట్ల మధ్య జీవితం ఇరుక్కుపోయినట్టుంది. అంతలో తళుక్కున ఓ ఆలోచన. గోడలు నేను కట్టే బదులు అవతలి వాళ్లతోనే కట్టిస్తే?!

వెంటనే దాన్ని అమల్లోకి తెచ్చాను. అవతలి వాళ్లని నమ్మనట్లు నటించడం, వాళ్ల మీద ఊరికే కోప్పడటం, నా చుట్టూ ఎంత తిరుగుతున్నా అస్సలు పట్టించుకోక పోవడం ఇలాంటివి. ఈ రూట్ బానే పనిచేస్తోంది కానీ నేను చాలా కష్టపడవలసి వస్తోంది. అంతా చేసాక చివరికి ఎదుటివాడు గోడ కడతాడో లేదో? ఉంటారు

కొంతమంది ఓపిగ్గా, మొహమాటంగా, కట్టకుండా! వాళ్ల గురించే నా భయం. టైం వేస్ట్. కానీ తప్పదు, మహీని తప్పించుకోవాలంటే ఇంకో మార్గంలేదు.

నేనిలా కొత్తగా ఎదుటివాళ్లతోనే గోడలు కట్టిస్తున్నానని మహీకి తెలిసి పోయింది!

"అలా అయితే నేనెందుకింక నీకు?" అన్నాడు.

"లేదు, నువ్వు చాలా అవసరం. గుర్తుందిగా ఇరవై ఏళ్లుగా మనిద్దరం కలిసి ఎన్ని కట్టామో?" అన్నాను సముదాయిస్తున్నట్టుగా.

"అంతేగానీ, గోడలు కట్టడం తగ్గించనంటావ్?"

"నీకేమన్నా పిచ్చా, నా బబుల్‌లో నేనుంటాను. అందరూ చేస్తున్నదేగా."

"సో, పక్కోడిని ఎప్పటికీ అర్థం చేసుకోవయితే. ఇన్నేళ్లొచ్చాక నువ్వు మారతావనుకున్నా."

అదా వీడి గొడవ. ఇప్పుడేదో కొత్తగా అర్థం చేసుకోవాలిట. మై గాడ్!

నేనేమీ తిరిగి అనలేదు. ఈ డిస్కషన్ కంటిన్యూ చెయ్యడం దండగని పిస్తోంది.

వాడే అన్నాడు మళ్లీ, "ఒక్కసారి ట్రై చేసి చూడు. ఈ గోడల్ని కూల్చి, ఇరుకు దారుల్ని కాదని విశాలమైన ప్రపంచంలోకి అడుగుపెట్టు. అప్పుడు చూడు భేదాలు లేని ఈ సమాజం ఎంత అందంగా కనబడుతుందో నీకు."

నాకు చిర్రెత్తుకొచ్చింది. వీడి పిచ్చి బాగా ముదిరింది. వీడి మాటలు వింటుంటే ఇన్నాళ్లూ నేను పడిన శ్రమంతా వృథా అయ్యేట్టుంది.

నా ఉనికిని కోల్పోకముందే తెలివి తెచ్చుకుని ఓ గట్టి నిర్ణయానికొచ్చాను.

"మహీ, ఓ గోడ కట్టాలి," అన్నాను నిశ్శబ్దాన్ని చీలుస్తూ.

తన మాటల్ని బేఖాతరు చేసానని వాడి మొహంలో బాధ స్పష్టంగా తెలుస్తోంది.

"ఎక్కడ కట్టాలి?"

"మనిద్దరి మధ్య!"

అదిరిపడ్డాడు వాడు.

"ప్లీజ్, తొందరపడకు. నీకు హెల్ప్ చేద్దామనే," దీనంగా మారింది గొంతు.

"లేదు, తొందరకాదు, జాగర్త పడుతున్నాను. నీ ఉపదేశాల్నుండి."

"ఇంకేం అనన్లే, నీ ఇష్టమొచ్చినట్టే చేస్తా," ప్రయత్నించాడు.

"అవసరం లేదు, కట్టాల్సిన గోడలు దాదాపు అయిపొయ్యాయ్. మిగిలినవి నేను చూస్కోగలను," అన్నాను ప్రశాంతంగా.

వాడో క్షణం నా కళ్లల్లోకి చూసి మెల్లగా కట్టడం మొదలుపెట్టాడు.

మధ్యలో ఆశగా అడిగాడు అటునుండి, "తలుపు పెట్టాలి కదా?"

మౌనంగా ఉన్నాన్నేను.

"ప్లీజ్."

"సరే పెట్టు. లాక్ నావైపు మాత్రమే ఉండేట్టు పెట్టు."

నిట్టూర్పు వినపడింది.

సన్నటి మూలుగు.

కొంతసేపటికి, "ఊఁ చూస్కో."

ఎదురుగా చూశాను. నల్లటి మసిబారినట్టున్న పెద్ద గోడ మా మధ్యలో.

పెద్దగా ఎక్కిళ్లు వినిపిస్తున్నాయి అటునుండి.

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*17 జులై 2022*

❋



1983లో గుంటూరు జిల్లాలో పుట్టిన **పాణిని జన్నాభట్ల** మొదటి కథ విద్యాదానం 2011లో కౌముది అంతర్జాల పత్రికలో ప్రచురించబడింది. దాదాపు 25 కథలు రాసారు. తనలో నన్ను కథాసంపుటి, ఒక నవల ప్రచురించారు. ఐటి మేనేజరుగా అమెరికాలోని బోస్టన్‌లో నివాసం

***panini@gmail.com***